ప్రభాత
కడప-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
మంగళవారం 16 సెప్టెంబర్ 2025

## శాంతిభద్రతలను పరిరక్షిస్తాం




**కడప క్రైం, సెప్టెంబరు 15, ప్రభాతవార్త:**
జిల్లాలో పోలీసు శాఖ పట్ల ప్రజల్లో మరింత నమ్మకం పెంపొందించేలా శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని జిల్లా నూతన ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన షెల్కే నచికేత్ విశ్వనాథ్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా నూతన ఎస్పీగా ఆయన బాధ్యతలు చేపట్టారు. ముందుగా జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా సాయుధ బలగాల నుంచి గౌరవ వందనం స్వీకరించి అనంతరం వేదపండితుల ఆశీర్వచనాలతో జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా షెల్కే నచికేత్ విశ్వనాథ్ మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో ఎస్పీగా విధులు నిర్వర్తించే అవకాశం రావడం సంతోషంగా ఉందని అవకాశం కల్పించిన సీఎంకు, డీజీపీకి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలోని అధికారులు, మీడియా, ప్రజల భాగస్వామ్యంతో డ్రగ్స్, గ్యాంబ్లింగ్, క్రికెట్ బెట్టింగ్, ఇతర అసాంఘిక కార్యకలాపాలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై చాలా కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మీడియా సమావేశంలో అదనపు ఎస్పీ కె.ప్రకాష్‌బాబు, అదనపు ఎస్పీ (ఏఆర్) రమణయ్య, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ ఎన్.సుధాకర్, కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు, స్పెసల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్లు దారెడ్డి భాస్కర్‌రెడ్డి, శివ శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## 12వ జాతీయ కరాటే పోటీలలో పీలేరు విద్యార్థుల ప్రతిభ

**పీలేరు సెప్టెంబర్ 15 ప్రభాతవార్త :**
కర్నూలులో జరిగినటువంటి జీకే ఎం ఏ12వ నేషనల్ కరాటే ఛాంపియన్షిప్ లో పీలేరు యోధా కరాటే అకాడమీ స్టూడెంట్స్ పాల్గొని తమ ప్రతిభ ను కనబరిచారు, ఈ ఛాంపియన్షిప్ లో పాల్గొనడానికి సుమారు 12రాష్ట్రాల నుండి 1500మంది విద్యార్థులు పాల్గొన్నారు, కాంపిటీషన్ చాలా కటినంగా వున్నప్పటికీ మన పీలేరు విద్యార్థుల 9 మంది ఒక్కొక్కరు కటా, ఫైట్ రెండు విభాగాలలో పాల్గొని 7బంగారు పతకాలు, 3 వెండి పతకాలు ,2 కాంస్య పతకాలను సాధించారు, ఈ పోటీలలో గీతాశ్రీ, వికాస్, ఫరూక్, ముదిత్ సాయి,సావన్, సహస్ర, అశ్విన్, పునీత్ తమ తమ వయసు మరియు బరువు విభాగాలలో పాల్గొన్నారు అని కరాటే మాస్టర్ జి. ఇనాముల్ హక్ తెలిపారు.



# దామరచర్లలో భారీగా ప్రభుత్వ భూములు కబ్జా

### రెండు రోజులుసెలవులతో జోరుగా ఆక్రమణలు... రెవెన్యూ సిబ్బందికి భారీగా ముడుపులు?

**పెనగలూరు సెప్టెంబర్ 15 ప్రభాతవార్త**
మండలంలోని దామరచర్ల రెవిన్యూ గ్రామంలో రెండు రోజుల సెలవుల్లో పెద్ద ఎత్తున ప్రభుత్వ భూములు కబ్జా జగిరినట్లు సమాచారం. అందుకు కొందరు రెవెన్యూ అధికారులు బాగా సహకరించినట్లు ఆరోపణ వినిపిస్తున్నాయి.శుక్రవారం అర్ధరాత్రి నుంచి సోమవారం తెల్లవారుజాము వరకు 50 ఎకరాల పైబడి బంజరు భూముల చదును కార్యక్రమం చేపట్టినట్లు సమాచారం. ఈ కార్యక్రమానికి నెల రోజుల నుంచి పథకం వేసుకోగా ఈనెల రెండవ శనివారం ఆదివారం రెండు రోజులు వస్తున్నాయని ఈ రెండు రోజుల్లో తమ కార్యక్రమాలు పూర్తి చేసుకోవాలని స్థానిక అధికారులు భరోసా ఇవ్వడంతో కబ్జాదారులు ఈ కార్యక్రమానికి పూనుకున్నారు. ఈ కార్యక్రమం బలవంతం కావడానికి రెండు నెలల నుంచి రెవెన్యూ సిబ్బందికి కబ్జాదారులకు బేరసారాలు జరుగుతున్నాయి. శుక్రవారం ముడుపులు ముట్టడంతో ప్రభుత్వ ఆక్రమణకు శ్రీకారం చుట్టారు. గత కొన్ని సంవత్సరాలుగాఆగిపోయిన భూకబ్జాలు మరలా ఊపొందుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ విషయంపై పెనగలూరు తాసిల్దారు డి.అమరేశ్వరుని వివరణ కోరగా దామరచర్ల పరిధిలో 2018 నుంచి ఇద్దరు వ్యక్తులకు సంబంధించిన భూములు కోర్టు పెండింగ్ లో ఉన్నాయని ఇటీవల పది రోజుల క్రిందట కోర్టు నుంచి ఆదేశాల రావడంతో ఇద్దరు వ్యక్తులు చదును చేసుకున్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా 2018 నుంచి దామరచర్ల పరిధిలో గల భూములకు ఎటువంటి కోర్టు ఆదేశాలు లేవని, పది రోజుల క్రిందట ఇద్దరు వ్యక్తులు అధికారికి ఆమ్యామ్యా సమర్పించుకొని అనధికారికంగా బోర్ వేసుకొని, కరెంటు తీసేందుకు స్తంభాలు కూడా అనధికారికంగానే నాటడం జరిగిందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. రెవిన్యూ ఉన్నతాధికారులు మండలంలోనీ దామరచర్ల లో జరిగిన భూకబ్జాలపై లోతుగా విచారణ జరిపిస్తే వాస్తవాలు వెలుగు చూసే అవకాశముంది.



## ప్రజల భాగస్వామ్యంతోనే

# నేర రహిత సమాజం సాధ్యం



**రాజంపేట, సెప్టెంబర్15 ప్రభాతవార్త**
జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ ప్రధాన లక్ష్యమని, అసాంఘిక కార్యక్రమాలపై డేగ కన్ను పెట్టి కఠిన చర్యలు చేపడతామని జిల్లా నూతన ఎస్పీ ధీరజ్ కునుబిల్లి తెలిపారు. సోమవారం అన్నమయ్య జిల్లా ఎస్పీగా ఉన్న వి.విద్యాసాగర్ నాయుడు స్థానంలో ఇక్కడకు బదిలీ అల్లూరి సీతారామరాజు జిల్లాలో అడిషనల్ ఎస్పీగా విధులు నిర్వహించిన ధీరజ్ కునుబిల్లి బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు ప్రత్యేక పోలీసు నుంచి స్వాగతం వందనాలు స్వీకరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టడం ఎంతో గౌరవంగా భావిస్తున్నాను అన్నారు.ఈ అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి , డిజిపి, కర్నూల్ రేంజ్ డీఐజీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మహిళలు, పిల్లలపై నేరాల నివారణకు ప్రత్యేక దృష్టి పెడదామన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు కృషి చేస్తానని అన్నారు. జిల్లాలో ఎర్రచందనం అక్రమ రవాణా పై ప్రత్యేక దృష్టి సారిస్తాం అని తెలియ జేశారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలపై గట్టి నిఘా ఏర్పాటు చేస్తామన్నారు.ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదులను చట్టపరంగా వేగంగా పరిష్కరిస్తాం అన్నారు. పెరుగుతున్న సైబర్ నేరాల నివారణకు గట్టి చర్యలు చేపడంతో పాటు ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. మాదకద్రవ్యాల నివారణ విషయంలో రాజీ లేని పోరాటం చేస్తామని పేర్కొన్నారు.డిజిటల్ అరెస్టులు, ఆ ధార్, క్రెడిట్ కార్డ్ మోసాలపై పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించి ప్రజల్లో చైతన్యం తీసుకొస్తామన్నారు. కళాశాలలు, పాఠశాలల్లో శక్తి టీమ్స్, మహిళా పోలీసులు, మీడియా సహకారంతో సైబర్ నేరాలు, పోక్సో చట్టంపై అవగాహన కల్పిస్తామన్నారు.ప్రజలు, మీడియా సహకారంతోనే నేరాల నివారణ సాధ్యం అవు తుందన్నారు. పోలీసు అధికారులకు దిశా నిర్దేశం బాధితులు స్వీకరించిన అనంతరం జిల్లా ఎస్పీ జిల్లాలోని పోలీసు అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారునేర నియంత్రణలో గట్టి చర్యలు తీసుకోవాలని దిశానిర్ధేశం చేశారు. ప్రజల నమ్మకం పొందేలా ప్రజాపోలీసు స్నేహ సంబంధాలు పెంపు చేయాలన్నారు. ప్రజలందరూ భయరహితంగా జీవించేలా చూడటం పోలీసు శాఖ ధ్యేయమని,సైబర్ నేరాలను అరికట్టేందుకు ఆధునిక సాంకేతికత వినియోగించాలన్నారు.మహిళా భద్రతకు ప్రాధాన్యత – 'శక్తి టీమ్స్' బలోపేతం చేయాలన్నారు.పోలీసు సిబ్బంది సంక్షేమం, శిక్షణ, వృత్తి అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ప్రజల భాగస్వామ్యంతోనే నేర రహిత సమాజం సాధ్యం అని ఎస్పీ స్పష్టం చేశారు. అంతకుముందు రాయచోటికి వచ్చిన నూతన ఎస్పీకి జిల్లా అదనపు ఎస్పీ (పరిపాలన) యం. వెంకటాద్రి , రాజంపేట ఏఎస్పీ మనోజ్ రామనాథ్ హెగ్డే , మదనపల్లి డిఎస్పీ ఎస్.మహేంద్ర , రాయచోటి డిఎస్పీ యం.ఆర్. కృష్ణమోహన్ , ఏఆర్ డిఎస్పీ యం. శ్రీనివాసులు స్వాగతం పలికారు. జిల్లాలోని సిఐలు, ఆర్ఐలు, ఎస్ఐ లు, ఆర్ఎస్ఐలు, డిపిఓ సిబ్బంది కొత్త ఎస్పీ ని కలసి మొక్కలు, పుష్పగుచ్ఛాలు అం దజేసి శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రజా ఫిర్యాదుల పట్ల అలసత్వం ఉండరాదు..



**కడప క్రైం, సెప్టెంబరు 15, ప్రభాతవార్త:**
జిల్లాలో ప్రజా సమస్యలపై పోలీసు అధికారులు తక్షణమే స్పందించి పరిష్కరించాలని, అలసత్వం ఉండరాదని జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ పోలీసు అధికారులకు దిశా నిర్దేశం చేశారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో కడప సబ్ డివిజన్ పోలీసు అధికారులు, ఇతర ప్రత్యేక విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాను అధ్యయనం చేసి శాంతిభద్రతల పరిరక్షణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో తీసుకుంటున్నామన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే పోలీసు అధికారులపై చర్యలు తప్పవన్నారు. అసాంఘిక కార్యకలాపాలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. ప్రతి పోలీసు అధికారితో వ్యక్తిగతంగా ఇంటరాక్ట్ అవుతామన్నారు. హోంగార్డు స్థాయి నుంచి అదనపు ఎస్పీ స్థాయి వరకు తనను ఎప్పుడైనా కలవచ్చున్నారు. సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాష్‌బాబు, అదనపు ఎస్పీ (ఏఆర్) బి.రహనయ్య, కడప డీఎస్పీ ఎ.వెంకటేశ్వర్లు, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ ఎన్.సుధాకర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ దారెడ్డి భాస్కర్‌రెడ్డి, కడప సబ్ డివిజనల్ సీఐలు, ఎస్సైలు, ప్రత్యేక విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థిని అనుమానాస్పద మృతి

### గుట్టు చప్పుడు కాకుండా మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించే యత్నం

### రంగంలోకి దిగి విచారిస్తున్న రాయచోటి పోలీసులు



**రాయచోటి, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త**
అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో విద్యార్థిని అనుమానాస్పద మృతి చెందడంతో తీవ్ర విషాదం నెలకొంది. పట్టణంలోని కొత్తపేట రామాపురం ఎన్జీవో కాలనీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న రేకులపల్లి లావణ్య (13) సోమవారం ఇంటిలో అనుమానస్పద స్థితిలో ఉరి వేసుకొని మృతి చెందింది. పోలీసుల, స్థానికుల సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.... రాయచోటి మండల పరిధిలోని యండపల్లి గ్రామం కొత్తపల్లికు చెందిన రేకులపల్లి మల్లిఖార్జున, అంజలి దంపతులు రాయచోటి పట్టణంలోని కొత్తపేట రామాపురం ఎన్జీవో కాలనీ లో నివాసం ఉంటున్నారు. మల్లిఖార్జున బిల్డారి పనులకు వెళ్తుండగా అంజలీ ఇళ్లలో పనికి వెళ్ళేది. వారికి ముగ్గురు సంతానం కలరు. వారిలో పెద్ద కుమార్తె లావణ్య సమీపంలోని ఎన్జీవో కాలనీలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. సోమవారం ఉదయం తల్లిదండ్రులు ఇద్దరూ వారి పనులకు వెళ్లారు. ఏం జరిగిందో తెలియదు కానీ విద్యార్థిని లావణ్య అనుమానస్పద స్థితిలో ఇంటిలోనే ఉరి వేసుకొని మృతి చెందింది. కొద్దిసేపటికి తల్లి అంజలి వచ్చి చూడగా ఉరి వేసుకుని ఉన్నట్లు గుర్తించి కేకలు వేసింది. ఆమె అరుపులతో స్థానికులు అక్కడకు గుంపులుగా చేరారు. కుటుంబ సభ్యులు గుట్టుచప్పుడు కాకుండా మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకెళ్లి అంత్యక్రియలు జరపాలని ప్రయత్నాలు కొనసాగించారు. ఈ విషయం స్థానిక పోలీసుల దృష్టికి వెళ్లింది. వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి, స్థానికులతో ఆరా తీశారు. ఆత్మహత్య చేసుకొని చనిపోయింది అని కుటుంబ సభ్యులు తెలుపుతున్నారు. ఇంత చిన్న వయస్సులో చనిపోవాల్సిన అంత కష్టం ఆ చిన్నారికి ఏమొచ్చిందని స్థానికులు చర్చించుకుంటున్నారు. పోలీసులు విచారణ జరిపి నిజానిజాలు వెలికి తీయాలని పలువురు అంటున్నారు.పోస్టుమార్టం నిమిత్తం బాలికను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రాయచోటి పోలీసులు తెలియజేశారు.

## సమాజ అభివృద్ధిలో ఇంజినీర్ల పాత్ర అత్యంత కీలకం..





**కడప, కార్పొరేషన్ సెప్టెంబర్ 15 ప్రభాతవార్త:**
సమాజ అభివృద్ధి, మౌలిక సదుపాయాలు కల్పనలో ఇంజినీర్ల పాత్ర అత్యంత కీలకమని, వారి సేవలు భావితరాలకు ఎంతో అవసరం అని కడప కార్పొరేషన్ ఎస్ ఈ చెన్నకేశవరెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ధనలక్ష్మి, విజయ్ కుమార్ రెడ్డి, రమణమూర్తి లు తెలిపారు. సోమవారం కడప నగర పాలక సంస్థలో సభాభవన్ లో ఇంజినీర్స్ డే వేడుకలు జరిగాయి. ముందుగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలదండవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజ అభివృద్ధిలో భాగస్వాములైన ఇంజినీర్స్ అందరికీ ఇంజినీర్స్ డే శుభాకాంక్షలు తెలియజేశారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య సేవలు, నీతి ప్రపంచ ఖ్యాతి పొందాయన్నారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య గారిని ఆదర్శంగా తీసుకొని అభివృద్ధికి అందరూ కలిసి పనిచేయాలన్నారు. సమాజ అభివృద్ధి, మౌలిక సదుపాయాలు కల్పనలో ఇంజినీర్లు కీలక పాత్ర పోసిస్తారని, మంచి ఇంజినీర్లు కనపరచిన పనితీరు ప్రజల జీవనంలో కనిపిస్తుందన్నారు. రోడ్లు, మౌలిక సదుపాయాలు, పేదలకు గృహ నిర్మాణాలు చేపట్టడంలో ఇంజనీరింగ్ అధికారులు, ఇంజనీరింగ్ సహాయక సిబ్బంది నైపుణ్యతతో పనులను పూర్తి చేయాలన్నారు. ఉద్యోగ కాలంలో చేపట్టిన పనులను, సేవలను ప్రజలు పదికాలాలు చెప్పుకొనేలా ఉండాలన్నారు. చేపట్టిన పనులలో నాణ్యత ఉండాలని, పనుల నాణ్యత భవిష్యత్తులో కూడా కనిపించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఈఈ లు సుధాకర్ నాయక్, దిల్షాద్, బాల మల్లేష్, మణి గోపాల్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, కిరణ్ కుమార్, సూపర్నెంట్ గుర్రప్ప, ఈ1 శివ కుమార్, ఈ2 శ్రీరాములు, ఎఈ లు ప్రశాంత్ రెడ్డి, దేవేందర్ రెడ్డి, పవన్ కుమార్, ప్రతాప్ రెడ్డి, శ్రీకాంత్, పూర్ణచంద్ర, నిరూపమా శ్రీనివాసరెడ్డి, లక్ష్మీనారాయణ, వర్క్ ఇన్స్పెక్టర్లు, ఫిట్టర్లు, అమినిటి సెక్రటరీలు పాల్గొన్నారు.

## గాలేరు-నగరి సుజల స్రవంతికి నిధులు కేటాయించి

# పనులు పూర్తి చేయాలి

**పెండ్లిమర్రి, సెప్టెంబరు 15, ప్రభాతవార్త:**
నిత్య కరవులతో వలసలను నివారించడానికి రాయలసీమను కరవు విముక్తి నుంచి కాపడడానికి రాయలసీమకు జీవనాడిగా ఉన్న గాలేరు–నగరి సుజల స్రవంతి పథకం కమలాపురం నియోజకవర్గంలో ఆగిపోయిందని గాలేరు నగరి సుజల స్రవంతి 2వ దశ పనులను ప్రారంభించినప్పటికీ నిధుల కొరతతో పనులు నత్తనడకన నడుస్తున్నాయని తక్షణం రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించి కమలాపురం నియోజకవర్గంలోని 90 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు కడప నగరానికి మరియు కొప్పర్తి పారిశ్రామికవాడకు తాగునీటి అవసరాలను తీర్చాలని రాష్ట్ర సీఎం చొరవ చూపాలని భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి.చంద్రశేఖర్, బి.వెంకటరాములు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక పెండ్లిమర్రిలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ శ్రీశైలం జలాశయం నుంచి వరద జలాలను గండికోట ప్రాజెక్టు ద్వారా పోతిరెడ్డి హెడ్ రెగ్యులేటర్ నుంచి నగరి వరకు వెళ్లాల్సిన జీఎన్ఎస్ఎస్ కెనాల్ పనులు నత్తనడకన నడుస్తున్నాయని గత ప్రభుత్వాల వైఫల్యం వల్ల పనులు ముందుకు సాగలేదన్నారు. ప్రస్తుతం రాష్ట్ర సీఎం చంద్రబాబునాయుడు గాలేరు నగరి సుజల స్రవంతి పథకానికి నిధులు కేటాయించి పనులను ప్రారంభించి రైతుల కష్టాలను పట్టణ ప్రాంత ప్రజల తాగునీటి ఇబ్బందులను నెరవేర్చాలని కోరారు. గుత్తేదారులు నిధులు లేకపోవడంతో అర్ధాంతరంగా పనులను ఎక్కడికక్కడ వదిలేసిన పరిస్థితిని ఆయన గుర్తు చేశారు. తక్షణం జీఎన్ఎస్ఎస్ కెనాల్‌కు నిధులు కేటాయించి త్వరితగతిన పూర్తి చేయాలని ఇది వరకే స్థానిక ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డికి రాష్ట్ర సీఎంకు కూడా విన్నవించినట్లు ఆయన తెలిపారు. నిధులు కేటాయించి రైతుల కష్టాలతో పాటు పట్టణ ప్రాంత ప్రజల ఇబ్బందులు పరిశ్రమలకు తాగునీటి అవసరాలు తీర్చాలని వారు కోరారు.

## ఆక్రమిత దారులను వదిలి పేదల జోలికి వస్తే

# తిరుగుబాటు తప్పదు

**బద్వేలు సెప్టెంబర్ 15, ప్రభాతవార్త**



బద్వేల్ పట్టణంలోని సర్వే నెంబర్ 1151,1152, 1153, 1154, 24 లో సర్వే నంబర్లలో కాపురం ఉన్న పేదలందరికీ ఇదే సర్వే నంబర్లలో ఇంటి పట్టాలు ఇచ్చి పక్కా గృహాలు నిర్మించాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా స్టాండింగ్ కమిటీ మెంబర్ ఎస్.చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. సోమవారము స్థానిక సర్వే నెంబర్ లపై భగత్ సింగ్ నగర్ నందు రెవెన్యూ డివిజనల్ అధికారి చంద్రమోహన్ ఆధ్వర్యంలో రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్,పోలీసు సంయుక్తంగా గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సభను ఉద్దేశించి ఎస్.చంద్రశేఖర్ మాట్లాడుతూ 2011 డిసెంబర్ రెండో తేదీన వేలాది మంది పేద ప్రజలతో పై సర్వే నెంబర్లలో గుడిసెలు వేసి నివాసం ఉంటున్న నేపథ్యంలో 2016 పక్కా ఇల్లు నిర్మించుకొని 1200 మంది పైబడి ఇక్కడే కాపురం ఉంటున్నారని, వీరందరికీ ఇక్కడే హక్కు పత్రాలు, పక్కా గృహాలు మంజూరు చేయాలని , గతంలో పనిచేసిన ఐదు మంది జిల్లా కలెక్టర్ గారి దృష్టికి తీసుకుపోయి, ప్రజలందరికీ పట్టాలు, పక్క గృహాలు మంజూరు చేయాలని కోరడంతో, అప్పుడు ఉన్న కలెక్టర్ వారు ఇరిగేషన్ నుండి రెవెన్యూకు మార్చి పక్కా గృహాలు పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చారని అన్నారు. 2021 వ సంవత్సరం ఉన్నత హైకోర్టులో పేద ప్రజల పక్షాన, భగత్ సింగ్ నగర్ లో ఇండ్లు నిర్మించుకున్న వారు హైకోర్టులో రిట్ పిటిషన్ వేసామన్నారు. హైకోర్టు ఇక్కడున్న పేదలందరికీ మౌలిక వసతులు కల్పించాలని ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. 2025వ సంవత్సరంలో నీటి సంఘం మాజీ అధ్యక్షుడు హైకోర్టులో రిట్ ఫిటిషన్ వేయడంతో ఇప్పుడు 320 మంది పేదలకు నోటీసులు ఇవ్వడం దుర్మార్గం అని వారు అన్నారు. తక్షణమే ఆయన కు వ్యతిరేకంగా రెవెన్యూ అధికారులు రిట్ పిటిషన్ వేసి భగత్ సింగ్ నగర్ లో ఉన్న పేద ప్రజలకి హక్కు పత్రాలు, పక్కా గృహాలు నిర్వహించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కమిటీ సభ్య జకరయ్య, అనిల్ ఏరియా కమిటీ సభ్యులు రామరాజు, బాబు, విజయరావు, జయరామరాజు, నారాయణ, పాండు, చంద్రపాల్ పాల్గొన్నారు.

## నిబంధనలు పాటించని వాహనదారులపై చర్యలు తప్పవు

**బద్వేలు అర్బన్, సెప్టెంబరు 15 ,ప్రభాతవార్త :**



నిబంధనలు పాటించని వాహనదారులపై చర్యలు తప్పవని అర్బన్ ఎస్ఐ సత్యనారాయణ అన్నారు. సోమవారం సాయంత్రం బద్వేలు పరిధిలోని పలు రహదారులలో తమ పోలీసు సిబ్బందితో కలిసి కలయ తిరుగుతూ ఆయన వాహనాల తనిఖీ చేపట్టారు. రోడ్డుపై అడ్డంగా నిలిపిన వాహనాలకు సంబంధించిన రికార్డులు సరిగా లేనివారికి జరిమానా విధించారు. అనంతరం ఎస్ఐ సత్యనారాయణ మాట్లాడుతూ వాహనదారులు ప్రతి ఒక్కరూ తప్పని సరిగా పోలీసు నిబంధనలు పాటించాలన్నారు. బండికి సంబంధించిన రికార్డులు లేనప్పుడు పోలీసులు వేసిన ఛలానాలు చెల్లించాలని ఎప్పటికప్పుడు ఛలానాలు చెల్లించని వాహనదారులకు సూచనలు ఇచ్చి పాత బకాయిలు చెల్లించేలా చర్యలు తీసుకున్నారు. ప్రతి వాహనదారుడు వేగాన్ని తగ్గించి నెమ్మదిగా వెళ్లాలని, అలాగే హెల్మెట్ తప్పనిసరి అని తెలిపారు.. వాహనాలు తోలేటపుడు ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు.అతివేగం ప్రాణానికే ప్రమాదకరమవుతుందన్నారు. వాహనాలు తోలేటపుడు తమ కుటుంబ సభ్యులను మరియు బాధ్యతలను దృష్టిలో ఉంచుకుని వాహనాలు నడపడం వలన ఎలాంటి ప్రమాదాలకు గురికాకుండా ఉంటారని, వాహనదారులు ప్రతి ఒక్కరూ వాహనాలు తోలేటపుడు తగిన జాగ్రత్తలు తీసుకుని సురక్షితంగా గమ్యం చేరేలా ఉండాలని పలువురు వాహనదారులకు సూచించారు.అలాగే మొబై ల్ మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడపడం వలన ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందన్నారు. అంతేగాక మైనర్‌లు వాహనాలు నడిపితే వారి తల్లి దండ్రులపై చర్యలు తీసుకుంటామన్నారు. కావున వాహనదారులు పోలీసు నిబంధనలు పాటిస్తూ ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలన్నారు. అలాగే ట్రాఫిక్ వద్ద సిగ్నల్ రూల్స్ పాటిస్తూ వాహనదారులు వాహనాలు నడపాలన్నారు. తోపుడు బండ్ల వారు ట్రాఫిక్ అంతరాయం కలిగిస్తున్నారని కావున ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు వహించలన్నారు. ముఖ్యంగా ఆటోవారు ప్యాసింజర్లను ఎక్కించుకునే సమయంలో నడి రోడ్డుపై నిలిపి ఇతర వాహనదారులకు ఇబ్బందులు కలిగించరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## మెడికల్ కళాశాలను ప్రభుత్వమే నడపాలి

**మదనపల్లె, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త :**
మదనపల్లె మెడికల్ కళాశాలను ప్రభుత్వమే నడపాలని సోమవారం సబ్‌కలెక్టరేట్ కార్యాలయం వద్ద విద్యార్థి, ప్రజాసంఘాలు, సిపిఐ, సిపిఎం, కాంగ్రెస్ పార్టీల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఎన్ఎస్‌యుఐ, మదనపల్లె అభివృద్ధి వేధిక, విద్యార్థులు కలసి నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సర్వేపల్లి నరసింహా మాట్లాడుతూ మెడికల్ కళాశాలను ప్రభుత్వ ఆధీనంలోనే నిర్వహించాలని కోరారు. యువగళం పాదయాత్రలో లోకేష్ ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని, 107, 108 జీఓలను రద్దు చేసి పేద బలహీవనర్గాలకు న్యాయం చేస్తానని ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పి–3 విధానంలో మెడికల్ కళాశాలను నిర్వహిస్తామని చెప్పడమంటే పేద విద్యార్థులకు వైద్యవిద్యను దూరం చేయడమే అన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, కాంగ్రెస్ నాయకులు రెడ్డిసాహెబ్, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి మురళిలు మాట్లాడుతూ మెడికల్ కళాశాలను ప్రభుత్వ ఆదీనంలోనే నిర్మించాలని పిపిపి విధానం ద్వారా పేద బలహీన వర్గాల ప్రజలకు వైద్యవిద్యను దూరం చేయడమే అన్నారు. పిపిపి ప్రైవేటీకరణ విధానాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మాదవ్ మాట్లాడుతూ పి3 విధానాన్ని వెనక్కి తీసుకోకపోతే ఉద్యమాలు ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూ జిల్లా అధ్యక్షులు సంపత్, ఎస్ఎఫ్ఐ నాయకులు అఫ్రీద్, జయబాబు, సిపిఎం నాయకులు నాగరాజు, ఎస్టీయూ నాయకులు క్రిష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.




ధర్నా చేస్తున్న దృశ్యం

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

**మదనపల్లె క్రైమ్, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త.**



రోడ్డు ప్రమాదంలో వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన సోమవారం మదనపల్లె మండలంలో జరిగింది. బాధితుని కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి పట్టణంలోని నీరుగట్టువారి పల్లెకు చెందిన ఆనంద్ (58) మదనపల్లె మండలం, పోతుబోలు సమీపంలోని ప్రైవేట్ పాఠశాలలో బస్సు క్లీనర్ గా పనిచేస్తున్నాడు. విధులకు హాజరయ్యేందుకు ఉదయం ఇంటినుండి ద్విచక్ర వాహనంలో పాఠశాలకు వెళ్తుండగా మార్గమధ్యంలోని తురకపల్లె వద్ద కుక్క అడ్డు రావడంతో అదుపుతప్పి బోల్తాపడ్డాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాధితున్ని గమనించిన స్థానికులు వెంటనే 108 లో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

